ప్రజాశక్తి
శుక్రవారం 19 మే 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

పడి.. లేస్తూ.. రిజిస్ట్రేషన్ల రెవెన్యూ...



ప్రజాశక్తి -గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లాలో 9 సబ్ రిజిస్ట్రార్‌ల పరిధిలో రెవిన్యూ పడి లేస్తూ వస్తోంది. మూడేళ్లుగా విశాఖపట్నం రిజిస్ట్రార్ కార్యాలయం అధీనంలోని పలు సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాల్లో హెచ్చు తగ్గులు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

ఆనందపురంలో స్వల్పంగా తగ్గుదల...

ఆనందపురం సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో 2021 మార్చి నాటికి 6,720 రిజిస్ట్రేషన్లకుగానూ రూ.66.79 కోట్లు ఆదాయం రాగా 2022 మార్చి నాటికి 4,694 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.56.05 కోట్లు ఆదాయం వచ్చింది. 2023 మార్చి నాటికీ 4,388 రిజిస్ట్రేషన్లకుగానూ రూ.55.28 కోట్లు ఆదాయం వచ్చింది.

భీమిలిలోనూ అదే స్థితి..

భీమునిపట్నం సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో 2021 మార్చి నాటికి 6,177 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.61.94 కోట్లు ఆదాయం రాగా, 2022 మార్చి నాటికి 6,865 రిజిస్ట్రేషన్లకుగానూ రూ.66.52 కోట్లు ఆదాయం వచ్చింది. 2023 మార్చి నాటికి 6,649 రిజిస్ట్రేషన్లకుగానూ రూ.56.57 కోట్లు ఆదాయం వచ్చింది.

ద్వారకానగర్‌లో పెరుగుదల..

ద్వారకానగర్ సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో 2021 మార్చి నాటికీ 6,913 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.87.70 కోట్లు ఆదాయం రాగా, 2022 మార్చి నాటికి 7,281 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.89.30 కోట్లు ఆదాయం వచ్చింది. 2023 మార్చి నాటికి 7,497 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.92.58 కోట్లు ఆదాయం వచ్చింది.

గాజువాకలో అంతంతే...

గాజువాక సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో 2021 మార్చి నాటికి 5,495 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.52.74 కోట్లు ఆదాయం రాగా, 2022 మార్చి నాటికి 6,858 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.70.60 కోట్లు ఆదాయం వచ్చింది. 2023 మార్చి నాటికి 9,484 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.70.03 కోట్లు ఆదాయం వచ్చింది.

గోపాలపట్నంలో పెరిగిన ఆదాయం...

గోపాలపట్నం సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో 2021 మార్చి నాటికీ 3,962 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.37.38 కోట్లు ఆదాయం రాగా, 2022 మార్చి నాటికి 4,731 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.47.30 కోట్లు ఆదాయం వచ్చింది. 2023 మార్చి నాటికి 4,734 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.49.11 కోట్లు ఆదాయం వచ్చింది.

మధురవాడలో స్వల్ప పెరుగుదల

మధురవాడ సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో 2021 మార్చి నాటికి 7,485 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.147.61 కోట్లు ఆదాయం రాగా, 2022 మార్చి నాటికి 9,646 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.222.79 కోట్లు ఆదాయం వచ్చింది. 2023 మార్చి నాటికి 10,392 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.243.84 కోట్లు ఆదాయం వచ్చింది.

పెందుర్తిలో హెచ్చు తగ్గులు...

పెందుర్తి సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో 2021 మార్చి నాటికి 8,186 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.66.97 కోట్లు ఆదాయం రాగా, 2022 మార్చి నాటికి 9,037 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.83.39 కోట్లు ఆదాయం వచ్చింది. 2023 మార్చి నాటికి 9,016 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.70.45 కోట్లు ఆదాయం వచ్చింది.

విశాఖపట్నం ఆర్‌ఒలో..

ఆర్ఒ విశాఖపట్నం

మిగతా 2లో..



వార్త 5లో..

టిడ్కో లబ్ధిదారులతో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

తెలుగుదేశంతోనే బీసీల అభివృద్ధి : చంద్రబాబు



ప్రజా ఉద్యమాలపై పోలీసు నిర్బంధం ఆపాలి : సిఐటియు

వార్త 8వ పేజీలో..

నిధుల కోతతో 'ఉపాధి'కి తూట్లు
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

వార్త మెయిన్‌లో..

మత్తు ఇంజెక్షన్లు, గంజాయి పట్టివేత : సిపి త్రివిక్రమ్‌వర్మ

వార్త 2లో..

పోలవరం పునరావాసంపై జూన్ 20 నుంచి సిపిఎం పాదయాత్ర

వార్త మెయిన్‌లో..



రోదిస్తున్న బంధువులు

ఇద్దరు పాలిటెక్నిక్ విద్యార్థుల గల్లంతు

వార్త మెయిన్ పేజీలో....

మీటర్లు గిర్రున తిరుగుతున్నాయ్...!

- అధికమవుతున్న విద్యుత్ వినియోగం
- కోటాకు మించి వాడకం
- సరఫరాలో అంతరాయం లేకుండా ఇపిడిసిఎల్ చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. వేసవి ఉష్ణోగ్రతలకు తోడు ఉక్కబోత ఎక్కువగా ఉండడంతో రోజంతా ఏసీ, ఫ్యాన్లు ఉపయోగిస్తున్నారు. దీంతో అంచనాకు మించి వినియోగం ఉంది. ఏసీల వాడకంతో వినియోగం ఎక్కువవుతోంది. మీటర్లు గిర్రున తిరుగుతున్నాయి. 2021 మే ఒకటినవున్న 22.10

మిగతా 2లో..

2021, 2022, 2023లో మే ఒకటి నుంచి 17 వరకు విద్యుత్ వినియోగం (మిలియన్ యూనిట్లలో)

	2021	2022	2023
1.	22.10	23.47	26.10
2.	22.71	24.91	26.77
3.	23.23	19.90	27.58
4.	23.49	24.09	27.57
5.	23.81	22.89	29.46
6.	23.96	22.61	29.72
7.	24.95	22.05	29.06
8.	24.54	23.43	29.37
9.	23.49	21.79	30.95
10.	24.16	19.92	30.21
11.	21.96	21.95	30.19
12.	21.96	22.77	31.53
13.	24.12	23.44	30.90
14.	23.98	21.48	31.15
15.	22.97	24.19	31.38
16.	22.47	25.97	32.07
17.	24.38	25.79	32.37

విద్యుత్ పొదుపుగా వాడాలి



వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడాలి. అధిక వాడకం వల్ల సరఫరాలో తలెత్తే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ట్రాన్స్‌ఫార్మర్, ఫీడర్ల ద్వారా ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా చేయనున్నాం. కోతలు లేకుండా విద్యుత్ అందిస్తున్నాం.

ఎల్.మహేంద్రనాథ్, ఎస్ఇ,
ఇపిడిసిఎల్ విశాఖ సర్కిల్

మొదటి పేజీ తరువాయి..

పడి.. లేస్తూ.. రిజిస్ట్రేషన్ల రెవెన్యూ...

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో 2021 మార్చి నాటికి 9,944 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.132.96 కోట్లు ఆదాయం రాగా, 2022 మార్చి నాటికి 12,246 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.203.62 కోట్లు ఆదాయం వచ్చింది. 2023 మార్చి నాటికి 14,578 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.199.52 కోట్లు ఆదాయం వచ్చింది.

పెద గంట్యాడలో స్వల్ప పెరుగుదల

పెదగంట్యాడ సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో 2021 మార్చి నాటికి 7,646 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.64.29 కోట్లు ఆదాయం రాగా, 2022 మార్చి నాటికి 6,542 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.69.69 కోట్లు ఆదాయం వచ్చింది. 2023 మార్చి నాటికి 7,646 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.64.24 కోట్లు ఆదాయం వచ్చింది.

జిల్లాలో గడచిన మూడేళ్ల రిజిస్ట్రేషన్ల వివరాలు

విశాఖ జిల్లాలోని మొత్తం 9 రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 2022- 23 ఆర్థిక సంవత్సరంలో 74,384 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.905.71 కోట్ల ఆదాయం వచ్చింది. 2021-22 మార్చి నాటికి 68,600 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.909.30 కోట్ల ఆదాయం, 2020- 2021 మార్చి నాటికి 62,528 రిజిస్ట్రేషన్లకు గానూ రూ.718.42 కోట్ల ఆదాయం వచ్చింది.

మీటర్లు గిర్రున తిరుగుతున్నాయ్...!

మిలియన్ యూనిట్ల (మి.యూ) విద్యుత్ వినియోగం, ఈ నెల 17 నాటికి 24.39 మి.యూకు చేరింది. 2022 మే ఒకటిన 23.47 మి.యూ వినియోగం, ఈ నెల 17 నాటికి 25.79 మి.యూకు పెరిగింది. 2023 మేలో ఈ వినియోగ నమోదు గత రెండు సంవత్సరాల కంటే ఎక్కువవుంది. ఈ ఏడాది మే ఒకటిన 26.10 మి.యూ వినియోగం నమోదుకాగా, 17వ తేదీకి 32.37 మి.యూ వరకు వెళ్లింది. ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యానికి మించి లోడ్ ఎక్కువగా ఉండడంతో, అవి దెబ్బతినకుండా దాదాపు 200 ట్రాన్స్‌ఫార్మర్లు ఇపిడిసిఎల్ ఏర్పాటుచేసింది. మరో 200 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయి. వీటిని కూడా వీలైనంత తొందరగా ఏర్పాటుచేస్తామని ఆ సంస్థ అధికారులు చెబుతున్నారు. విద్యుత్ అధిక వినియోగంతో సరఫరాలో సాంకేతిక అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెంటనే విద్యుత్ పునరుద్ధరించే చర్యలు చేపడుతున్నారు.

మత్తు ఇంజెక్షన్లు, గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సిపి త్రివిక్రమ్‌వర్మ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీతమ్మధార, పెందుర్తి, 2వ పట్టణ పోలీస్ స్టేషన్ల పరిధిలో భారీగా మత్తు ఇంజెక్షన్లు పట్టుబడ్డాయని నగర పోలీస్ కమిషనర్ సిఎమ్.త్రివిక్రమ్‌వర్మ తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీతమ్మధార స్పెషల్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీస్ స్టేషన్ పరిధిలో సీతమ్మధార, కనకపువీధి వద్ద ఈ నెల 17న ముందుగా సమాచారం వరకు తనిఖీలు నిర్వహించగా 3000 పెంటాజోసిన్ ఇంజెక్షన్లతో 60 బాక్సులను కలిగి ఉన్న గుంటు ఉమా మహేష్ (45)ను అరెస్టు చేశామని, నిందితుడు ఇప్పటికే రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 2 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని తెలిపారు.

పిఎంపాలెం, మధురవాడ ప్రాంతాల్లో ముందుగా అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా 2 బాక్స్‌ల్లో 100 పెంటాజోసిన్ ఇంజెక్షన్లు లభించాయని, ఈ కేసులో మధురవాడకు చెందిన భీమవరం వెంకటేష్ (35)ను అరెస్టు చేశామని తెలిపారు. ఈయనపై మహారాణిపేట, గోపాలపట్నం పోలీస్ స్టేషన్లలో గంజాయి కేసులు ఉన్నాయని, ప్రస్తుతం బెయిల్‌పై వచ్చి ఉన్నాడని పేర్కొన్నారు. ఈ ఇంజక్షన్లు ఉపయోగిస్తున్న 14 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు.

రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 17వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు అల్లిపురం శ్రీ సాయి సరస్వతి లాడ్జిలో తనిఖీలు నిర్వహించగా 50 బాక్సులలో సుమారు 2050 పెంటాజోసిన్ లాక్టేట్ ఇంజెక్షన్లు, 21 కేజీల గంజాయి లభించిందని తెలిపారు. ఈ కేసులో బోడ శ్రీను (38), బోడ లక్ష్మి (28), గొల్ల వెంకటసాయి (24)లను అరెస్ట్ చేశామని తెలిపారు. మీరు ఒక ఇంజక్షన్‌ను రూ.250 నుంచి రూ.300కు విక్రయిస్తున్నారని వివరించారు.

ఈ నెల 14వ తేదీన రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి అల్లిపురం రైల్వే క్వార్టర్స్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో 42 బాక్సులలో 2100 పెంటాజోసిన్ ఇంజెక్షన్లు, 21 కేజీల గంజాయి లభించిందని తెలిపారు. ఈ కేసులో కాళ్ల హరిపద్మ రాఘవరావు, పట్టాభి రవి, కట్టా చిరంజీవిలను అరెస్ట్ చేశామని, పితాని అప్పలరాజు, పితాని రవి, శ్యామ్, వానపల్లి జగదీష్‌లను అరెస్ట్ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ నాలుగు కేసులలో మొత్తం ఇంజక్షన్లను పశ్చిమ బెంగాల్ ఖరగ్పూర్‌కు చెందిన డ్రగ్ సప్లయర్స్ దుర్గాప్రసాద్, బిమల్ కండేవాలా నుంచి కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నట్టు గుర్తించామని చెప్పారు.

డిఆర్ఎం కప్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : విశాఖపట్నం రైల్వే ఇండోర్ బాక్సింగ్ హాల్‌లో ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్, వాల్తేరు నిర్వహించనున్న డిఆర్ఎం కప్ స్టేట్ యూత్ మెన్, ఉమెన్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోస్టర్‌ను గురువారం డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ సత్పతి విడుదల చేశారు. ఈ డిఆర్ఎం కప్ యూత్ పురుషుల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో 100 మంది బాక్సర్లు, మహిళల విభాగంలో 50 మంది, వివిధ జిల్లాల నుండి 50 మంది అధికారులు పాల్గొంటారు.

మహోన్నత వ్యక్తి సుందరయ్య



సుందరయ్య వర్ధంతి సభలో మాట్లాడుతున్న సుబ్బారావు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : భారతదేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి, మహాశక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని పలువురు శ్లాఘించారు. సుందరయ్య 37వ వర్ధంతి సందర్భంగా గురువారం సాయంత్రం పూర్ణా మార్కెట్ సమీపంలోని ప్రసాద్ గార్డెన్స్‌లో వై.రాజు అధ్యక్షతన మహిళా సంఘం, సిఐటియు ఆధ్వర్యాన సుందరయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు ఎం.అన్నపూర్ణ మాట్లాడుతూ, సుందరయ్య త్యాగమూర్తి అన్నారు. సుందరయ్య త్యాగం వల్ల దక్షిణ భారతదేశంలో సిపిఎం అభివృద్ధి చెందిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, విజయ, ముఠా కార్మికుల సంఘం నాయకులు ఎం.సుబ్బారావు, తదితరులు పాల్గొని సుందరయ్యకు నివాళులర్పించారు.

టిడ్కో లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయండి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు బ్యాంకర్లు త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ బ్యాంకుల అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జివిఎంసి పరిధిలోని అన్ని బ్యాంకుల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, త్వరలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిచే దబ్బంద, సత్యనారాయణపురంలలోని టిడ్కో ఇళ్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులందరికీ ఈ నెలాఖరుకు బ్యాంకు రుణాలు పూర్తి చేయాలని కోరారు. ఫేజ్-1లో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లకు జూన్ 15వ తేదీ లోపు రుణాలు మంజూరుచేయాలన్నారు.

21న అఖిల భారత ఆదివాసీ జాతీయ సదస్సు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : గిరిజనులపై పెరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ సంఘాల నాయకులతో జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ జాతీయ సదస్సు నిర్వహణ కమిటీ కార్యదర్శి ఎస్.రామ్మోహన్ తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదివాసీల భూమిని, జీవనోపాధిని, అస్తిత్వాన్ని కాపాడుకోవడం, విస్థాపనలేని అభివృద్ధిని, అడవులను రక్షించుకోవడం లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 21న డాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం వేదికగా జరగనున్న ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, బీహార్, యుపి, త్రిపుర, మణిపూర్ రాష్ట్రాల నుంచి ఆదివాసీ సంఘాల నాయకులు సుమారు 750 మందికి పైగా పాల్గొంటారని తెలిపారు. ఆదివాసీ రచయిత, పాత్రికేయులు, జార్ఖండ్ మహిళా కమిషన్ మాజీ సభ్యులు డాక్టర్ కిరో, అఖిల భారత రైతు కూలీ సంఘం అధ్యక్షుడు వేములపల్లి వెంకట రామయ్య, న్యాయవాది త్రినాథరావు, కేంద్ర ఇంధన శాఖ మాజీ సెక్రెటరీ ఇఎఎస్ శర్మ తదితరులు సదస్సులో ప్రసంగిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు డి.సురేష్, ముక్కి సత్యం, జయలక్ష్మి, భూషణం, మహర్షి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న
ఆదివాసీ జాతీయ సదస్సు నిర్వహణ కమిటీ సభ్యులు

'జగన్‌కు అప్పులు చేయడం తప్ప అభివృద్ధి తెలియదు'



చంద్రబాబుకు వినతిపత్రం అందిస్తున్న బివి.రామ్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి అప్పులు చేయడం తప్ప అభివృద్ధి తెలియదని తెలుగు శక్తి అధ్యక్షుడు బివి రామ్ ఆరోపించారు. టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు వినతిపత్రం సమర్పించిన బివి.రామ్ స్థానిక మీడియాతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర ప్రజలు అమరావతి ఏకైక రాజధానిగా కోరుకుంటున్నారన్నారు. యువతకు ఉద్యోగాలు రావాలంటే మళ్ళీ చంద్రబాబు రావాల్సిందేనన్నారు. వచ్చే ఎన్నికలు వైసిపికి అంతిమయాత్ర వంటివి అని పేర్కొన్నారు. రానున్న ఎన్నికలలో జగన్మోహన్‌రెడ్డికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అన్ని తరగతుల ప్రజలు జగన్మోహన్ రెడ్డి పాలనలో విసిగిపోయారన్నారు.

ఘనంగా కొమర్రాజు జయంతి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వ విద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యాన తెలుగు భాష, సాహిత్య, చరిత్ర పరిశోధనా పితామహుడు కొమర్రాజు వెంకట లక్ష్మణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. కొమర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ, కొమర్రాజు శక్తిగా మారి భాష, సాహిత్యం, చరిత్ర శోధన కోసం కృషిచేశారని తెలిపారు. పద్నాలుగు భాషలలో పాండిత్యం సంపాదించడమే గాక శాసనాలను పరిశోధించి పరిష్కరించిన గొప్ప మేధావి అని కొనియాడారు.

సమ్మర్ క్యాంపు పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వీసీసీ సమ్మర్ క్యాంపు పోస్టర్‌ను పిఠాపురం కాలనీ పార్కులో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మధు బొర్రా, రొటేరియన్ మోదంబికా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీసీ ఫౌండర్ డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ, వీసీసీ సమ్మర్ క్యాంపు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు అనకాపల్లి జిల్లా తిమ్మరాజుపేటలోని డావిన్సి ఇంటర్నేషనల్ స్కూల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులో 8వ తరగతి, ఆపై తరగతులు విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 8309812422, 9398970538 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీసీసీ సభ్యులు డేనిత్ శైలజ, నీలవేణి, మణి, నాగమణి, షర్మిల, ప్రవల్లిక, అంజలి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మధు బొర్రా, మోదంబికా, రమాప్రభ తదితరులు

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి- ములగాడ : స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చిన్నారులు తయారుచేసిన కళాకృతులు ఆకట్టుకున్నాయి. జేసు, ధనుష్ తయారుచేసిన లైట్ హౌస్, అజయ్ తయారుచేసిన ఇల్లు, ధనుష్, పర్వీన్ తయారుచేసిన గ్రీన్ హౌస్, జ్యోతిర్మయి, శ్రీ శాంత్, మాధవ్ , రుత్విక్ ,లిఖిత్ తయారు చేసిన ఫేసు ఫ్రేమ్ బి.సంతోష్ కుమార్, అభిరామ్ తయారుచేసిన ఫోటో ఫ్రేమ్, సమత, సునీత, సంజన, పర్వీన్ తదితరులు తయారుచేసిన బొకేలు, సిద్ధార్థ, జతిన్ తదితరులు తయారుచేసిన గ్రీటింగ్ కార్డులు ఆహుతులను అలరించాయి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన వై. అనసూయాదేవి, లావణ్య, అలేఖ్యలను చిన్నారులను ప్రశంసించారు. అనంతరం నీతి కథలను కార్మిక నేత బి.సత్యానందం వివరించారు. గ్రంథాలయాధికారి వి. అజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్ భాగ్యలక్ష్మి పర్యవేక్షించారు.



మల్కాపురంలో చిత్రకళపై అవగాహన కల్పిస్తున్న అతిథులు



ఆనందపురంలో పొదుపుపై అవగాహన కల్పిస్తున్న బిపిఎం

ఆనందపురం : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం కథలు వినడం, కథలు రాయడం, కథలు చెప్పడం కార్యక్రమాలతోపాటు 'విద్యార్థులు - పొదుపు' అంశం పై ఆనందపురం బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ఎంఎస్ హెచ్ కృష్ణ అవగాహన కలిపించారు బాలబాలికలకు ఉచితంగా పోస్టుకార్డులు పంపిణీ చేసారు. లైబ్రేరియన్ బివిఎస్ అప్పారావు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా గురువారం ఉపాధ్యాయులు సత్యనారాయణ విద్యార్థులకు చిత్రలేఖనంలో మెలకువలు నేర్పించారు. భాష ప్రాధాన్యతను వివరించారు. ఉపాధ్యాయిని ఆశాజ్యోతి పర్సనాలిటీ డెవలప్మెంట్ ప్రాధాన్యతను తెలియజేశారు. సమ్మర్ క్యాంప్ కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్ విద్యార్థులకు అభ్యసనం నేర్పించారు. గ్రంథాలయాధికారి ఎల్‌వి రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కోటవురట్ల: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం శాఖ గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మంచి పుస్తకం చదవడం అలవాటు చేసుకోవాలని చిన్నారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గొలుగొండ: విద్యార్థులంతా ఉన్నతమైన లక్ష్యాలు ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు త్రిమూర్తులు అన్నారు. గొలుగొండ శాఖ గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులంతా లక్ష్యాలను ఉన్నతంగా నిర్దేశించుకోవాలన్నారు. వాటిని సాధించే మార్గాలను శోధించుకొని సాధించే తత్వాన్ని ప్రతి ఒక్కరు పెంపొందించుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారి రాజబాబు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.



గొలుగొండలో మాట్లాడుతున్న జెవివి నేత త్రిమూర్తులు

నేరాలు ఘోరాలు

అనుమానాస్పద రీతిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని కోలవానిపాలెం గ్రామానికి చెందిన గన్‌రెడ్డి ధారయ్య(26) అనుమానాస్పద రీతిలో మృతి చెందినట్లు గుర్తించారు. ఈనెల 13 నుంచి దారయ్య కనిపించడం లేదని అతనిఅన్నయ్య గౌరీస్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దారయ్య పెందుర్తి, గొల్లపల్లి గ్రామంలో జెసిబి డ్రైవర్‌గా నాలుగేళ్లుగా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ప్రతిరోజు ఉదయం 7:30 గంటలకు డ్యూటీకి వెళ్లి, తిరిగి సాయంత్రం 6:30 గంటలకు ఇంటికి వస్తుంటాడు. అయితే ఈనెల 13న ఉదయం విధులకు వెళ్లిన దారయ్య సాయంత్రం తిరిగిరాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా గురువారం జివిస్ అగ్రహారం గోరింటాగండం దిబ్బ దగ్గర మోటర్ బైక్ పక్కన యువకుడు మృతి చెందిన మృతి చెంది ఉన్న విషయాన్ని స్థానికులు గమనించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతుడు ధారయ్యగా గుర్తించారు. చనిపోయి నాలుగు రోజులు అయిఉంటుందని భావిస్తున్నారు. బైక్‌ను ఆనుకుని మృతదేహం ఉండడం, పక్కనే పురుగుల మందు బాటిల్, వాటర్ బాటిల్ ఉండడంతో ఆత్మహత్య చేసుకున్నాడా? లేదా ఎవరైనా చంపేసి ఇక్కడ తీసుకొచ్చి పడేశారా? అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడికి వివాహం కాకపోగా, తల్లిదండ్రులు మహాలక్ష్మి, దేవుడుఅన్నయ్య గౌరీష్, అక్క ప్రత్యూష ఉన్నారు సిఐ రామచంద్రరావు ఆధ్వర్యంలో ఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు



దారయ్య (ఫైల్‌ఫోటో)

సకాలంలో వైద్యంతో తప్పిన ప్రాణాపాయం

- కోలుకుంటున్న పాముకాటు బాధితుడు



చికిత్స అనంతరం కోలుకున్న పాము కాటు

ప్రజాశక్తి -తగరపువలస: పాము కాటుకు గురై సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు కోలుకుంటున్నాడు. వివరాలివి. ఎం.బంగారయ్య అనే వ్యక్తికి ఈ నెల 12న తెల్లవారుజామున ఐదుగంటలకు పాముకాటుకు గురవ్వగా, ఆయన కుటుంబసభ్యులు స్థానిక సంగివలస , అనిల్ నీరుకొండ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సాయిశేఖర్, శ్రీకాంత్, విద్యాధర్‌తో పాటు ఎనస్థీషియన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌తో కూడిన వైద్యుల బృందం వెంటనే స్పందించి, బాధితులకు వైద్యసేవలు అందించింది. ఆసుపత్రికి వచ్చేసరికే కళ్లువాలిపోవడం, మగతగా ఉండడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపించడంతో, పాము కాటు విషం బాధితుడి నరాల్లోకి వ్యాపించినట్లు వైద్యులు గుర్తించారు. కృత్రిమశ్వాసను అందించి, రెండురోజుల పాటు పాముకాటుకు విరుగుడు, ఇతర చికిత్సలు అందించారు. ప్రస్తుతం బాధితుడు కోలుకుంటున్నాడని, కృత్రిమశ్వాసను తొలగించామని వైద్యులు అంటున్నారు. కాగా పాముకాటుకు గురైన వెంటనే నాటు, పసర వైద్యాలను ఆశ్రయించకుండా వెంటనే ఆసుపత్రికి తీసుకురావాలని వైద్యులు సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణమూర్తి , మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కె.రామలక్ష్మి పర్యవేక్షణలో వైద్యబృందం సేవలతో బాధితుడు కోలుకుంటుండడంపై కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అప్పన్న హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి- సింహాచలం : సింహాద్రి అప్పన్నకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను 29 రోజులగాను గురువారం తెరిచి లెక్కించారు. ఆలయ అధికారుల సమక్షంలో లెక్కింపులో హుండీ ఆదాయంగా రూ1,89,90,670 నగదు, 124. 600 గ్రాముల బంగారం, 14.565 కిలోల వెండి వచ్చిందన్నారు.

20న సమ్మర్ కల్చరల్ ప్రోగ్రాం

ప్రజాశక్తి -కంచరపాలెం : బొట్ల నరసింహారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంచరపాలెం బిఎన్ఆర్ భవనంలో ఈ నెల 20న, శనివారం సాయంత్రం సమ్మర్ కల్చరల్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బిఎన్ఆర్ భవనంలో కరాటే, కంప్యూటర్, విసిసి టైలరింగ్ కోర్సులలో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో పాటు కంచరపాలెం ప్రాంత కళాకారులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఔత్సాహికులు, కళాభి మానులు, స్థానికులు పాల్గొని జయప్రదంచేయాలని కోరారు.

బాల సదనంలో ప్రవేశానికి వచ్చే నెలాఖరు వరకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్త్రీ శిశు సంక్షేమ శాఖ నిర్వహణలో స్థానిక చిన బజారులో ఉన్న బాలసదనంలో ప్రవేశానికి జూన్ 30 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూపరింటెండెంట్ కె ప్రమీల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు లేని పిల్లలు, తల్లి లేదా తండ్రి లేని పిల్లలకు ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు బాల సదనంలో ప్రవేశానికి అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 7893514460, 9848524446 మొబైల్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ప్రాంగణ నియామకాలలో 24 మంది ఎంపిక

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని సాయిగణపతి పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నాగార్జున ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్ లిమిటెడ్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో వివిధ అంచెల్లో పరీక్షలు నిర్వహించిన తర్వాత 24 మందిని ఎంపిక చేశారని కళాశాల ప్రిన్సిపల్ ఎల్.మహేశ్వరరావు తెలిపారు. 200 మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలలో పాల్గొన్నారన్నారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ ఎస్ వేణుగోపాల్, ఉపాధ్యాయుల అభినందనలు తెలిపారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి -సీతమ్మధార : జివిఎంసి మూడో జోన్ పరిధిలోని ఎసిపి వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఎంవివి కాలనీ, సీతమ్మధార ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌పై ఆక్రమణలను స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా టిపిఎస్ తేజ మాట్లాడుతూ ఫుట్‌పాత్‌పై గోడలకు అతికించిన స్టిక్కర్లు కూడా తొలగిస్తామన్నారు. మూడో జోన్ పరిధిలో సీతమ్మపేట, గురుద్వార్, సీతమ్మధార, హెచ్‌బి కాలనీ, మద్దిలపాలెం ఏరియాలో వాల్‌పోస్టర్లు తొలగించామన్నారు. కొత్తగా ఎవరైనా వాల్‌పోస్టర్లు అతికిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పారిశుధ్య కార్మికులకు సబ్బుల పంపిణీ

ప్రజాశక్తి-ఉక్కునగరం : జివిఎంసి పారిశుధ్య కార్మికులకు గురువారం 87వ వార్డు వడ్లపూడి సచివాలయం వద్ద టిడిపికి చెందిన వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం గురువారం సబ్బులు పంపిణీ చేసారు.ప్రజారోగ్యం కోసం అనారోగ్యకర వాతావరణంలో చెత్త సేకరణ, రోడ్ల శుభ్రత, కాలువలలో పూడికలు తియ్యటం వంటి పనులు చేస్తున్న పారిశుధ్య కార్మికుల బాగోగులు చూడాల్సిన బాధ్యత అందరి పైనున్నారు. వారికి ఏ అవసరం వచ్చినా తాను అందుబాటులో ఉంటానన్నారు.కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, శానిటేషన్ సిబ్బంది శ్రీను, మూర్తి, సచివాలయం సెక్రటరీలు, టిడిపి నాయకులు విజయరామరాజు, రాజేంద్ర, నూకరాజు, భాగ్యలక్ష్మి, సూరిబాబు పాల్గొన్నారు



సబ్బులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ జగన్నాథం

అక్రమ నిర్మాణాలను అడ్డగింత



అక్రమ నిర్మాణ పనులు ఆపుతున్న ఆర్ఐ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - ఆరిలోవ : తోటగరువు సర్వే నెంబరు 97లో రాధాకృష్ణ కళ్యాణమండపం సమీపంలో గెడ్డ అంచున్న నిర్మిస్తున్న అక్రమ కట్టడాన్ని రెవెన్యూ అధికారులు గురువారం అడ్డుకున్నారు. చినగదిలి ఆర్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది అక్కడకు చేరుకుని, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నట్లు అందిన సమాచారం మేరకు, తహశీల్దార్ ఆదేశాలతో పనులను అడ్డుకున్నారు. **ప్రభుత్వ బోర్డును తొలగించి మరీ అక్రమ నిర్మాణం...** తోటగరువు, గణబాబు నగర్ సర్వే నెంబరు 55లో కొండను తొలిచి అక్రమంగా నిర్మాణం చేపడుతున్న స్థలంలో ఇది వరకు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ బోర్డును పాతారు. అధికారులు పాతిపెట్టిన బోర్డును తొలగించి నిర్మాణం చేపట్టడంతో తహశీల్దారు ఆదేశాల మేరకు అడ్డుకున్న రెవెన్యూ అధికారులు, ఆదేశాలను బేఖాతరు చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఎంఆర్ఐ హెచ్చరించారు.

శరవేగంగా పార్కు సుందరీకరణ పనులు

ప్రజాశక్తి- వేపగుంట : 52వ వార్డులో పార్కుల అభివృద్ధి, సుందరీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. శాంతీనగర్ ప్రాంతంలో పార్క్ సుందరీకరణ పనులను నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గురువారంపరిశీలించారు. పనుల్లో నాణ్యతాలోపం లేకుండా చూడాలని, పార్కుల్లో పచ్చదనం, ఆహ్లాదం పెంచేందుకు వివిధ రకాల మొక్కలను నాటి పెంచాలని సూచించారు. అన్ని హంగులతో పార్కును సుందరీకరించి, త్వరలో ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు.



పార్కు అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్

సామాజిక సేవ ద్వారా గుర్తింపు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

ప్రజాశక్తి- గాజువాక:సామాజిక సేవతోనే వ్యక్తులకు గుర్తింపు వస్తుందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు జన్మదినం సందర్భంగా బిసి రోడ్డు, దయాల్‌నగర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు.ముందుగా జన్మదిన కేక్ కట్ చేసి, తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయాల్లో ఉంటూ స్వచ్ఛంద సేవచేయడం చాలా గొప్ప విషయమని, సామాన్య కార్యకర్తగా ప్రస్థానాన్ని ప్రారంభించి, నేడు కార్పొరేటర్‌గా ప్రజలకు సేవ చేయడమే కాకుండా ,వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న నరసింహపాత్రుడు అభినందనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మన్ పల్లా చినతల్లి, వైసిపి నేతలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



సందర్శకులకు అవగాహన కల్పిస్తున్న జూ ఎడ్యుకేషన్ టీం

ప్రజాశక్తి - ఆరిలోవ : లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్‌లో భాగంగా ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన ఆధ్వర్యంలో జూ పార్కులో గురువారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. జూ పార్కుకు వచ్చే సందర్శకులకు జూ ఎడ్యుకేషన్ బృందం సేవ్ వాటర్, సేవ్ ఎనర్జీ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, ఇ-వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ సుస్థిరత గురించి సందర్శకులకు అవగాహన కల్పించడానికి ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు.

యూనియన్ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న పైడిరాజు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ ఉక్కు శ్రామిక సంఘం యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ యూనియన్ నాయకులు బొడ్డు పైడిరాజు అన్నారు గురువారం సమతానగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, యూనియన్ బలోపేతానికి 27మందితో నూతన కమిటీ నియమించామన్నారు. త్వరలో విశాఖ ఉక్కు శ్రామిక సంఘం డిపార్ట్‌మెంట్‌లో కమిటీ నియామకం జరుగుతుందన్నారు. సమావేశంలో గౌరవాధ్యక్షులు కరణం సత్యారావు, అధ్యక్షులు ఎం. కోటేశ్వరరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడి అప్పారావు, మొల్ల ప్రకాష్‌యాదవ్, సమ్మిడి రాజు, నక్కా మహాలక్ష్మి నాయుడు, బొడ్డు రమణ, కరణం సురేష్ కుమార్ పాల్గొన్నారు.

- సాగుదారుల స్థానంలో బినామీలకు చోటు
- రియల్టర్లకు కట్టబెట్టేందుకు రెవెన్యూ కుట్ర?
- వైసిపి బడాబాబు కనుసన్నల్లోనే వ్యవహారం
- లబోదిబోమంటున్న బాధిత రైతులు
- అన్నదాతలకు బాసటగా నిలిచిన సిపిఎం

ఫెయిర్ అడంగల్‌లో.. పేర్లు తారుమారు..!



తమ వద్దనున్న ఆధారాలతో బాధిత రైతులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : దశాబ్దాల తరబడి సాగులో ఉన్న భూములకు, సెటిల్‌మెంట్ ఫెయిర్ అడంగల్ (ఎస్‌ఎఫ్‌ఎ)లో పేర్లు తారుమారై బినామీలకు చోటు దక్కడంపై రైతులు ఆవేదన చెందుతున్నారు. సాగుప్రాప్తికి భూయాజమాన్య హక్కుల కోసం దరఖాస్తు చేసుకుని, వస్తాయని ఏళ్లతరబడి ఎదురుచూస్తున్న రైతులు, ఏకంగా పేర్లు గల్లంతుపై అవాక్కయ్యారు. అధికారపార్టీకి చెందిన బడాబాబు జోక్యం, ఒత్తిళ్లకు తలొగ్గి, భీమిలి మండల రెవెన్యూ అధికారులు ఇంతటి అన్యాయానికి పాల్పడ్డారని నారాయణరాజుపేట రెవెన్యూ పరిధిలోని సంబంధిత రైతులు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళితే...

భీమిలి మండలం, నారాయణరాజు పేట రెవెన్యూ పరిధిలో సుమారు 400 ఎకరాలు ఇనాం భూములు ఉన్నాయి. పూర్వీకుల నుంచి ఈ భూములను నారాయణరాజుపేట, సింగనబంద, లక్ష్మీపురం, దాకమర్రి గ్రామాల రైతులు వరి, మొక్క జొన్న, బెండ తదితర పంటలు సాగుచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. సాగునీటి అవసరాలకు వ్యవసాయ బోర్లు వేయించి, విద్యుత్ ఛార్జీలు కూడా రైతులే చెల్లిస్తున్నారు.

పట్టాదారు పాసుపుస్తకాల కోసం ఎదురుచూపు

ఇదిలా ఉండగా, ఏళ్ల తరబడి తమ సాగులో ఉన్న ఇనాం భూములను సర్వే చేసి, తమకు భూయాజమాన్య హక్కు కల్పించి పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేయాలని ఏళ్ల తరబడి రైతులు అడుగుతూనే ఉన్నారు. అలానే చేస్తాం అంటూ నేతలు హామీలిచ్చారేగానీ, నేటికీ కార్యరూపం దాల్చలేదని రైతలుఉ ఆవేదన చెందుతున్నారు. 2004లో రాజశేఖరరెడ్డి సిఎంగా పట్టాదారుపాసుపుస్తకాల జారీకి చర్యలు చేపట్టగా, దేవాదాయ భూములను సాకుగా చూపి అభ్యంతరం చెప్పడంతో నేటికీ మోక్షం కలగలేదని రైతులు వాపోతున్నారు.

ఎస్‌ఎఫ్‌ఎ డ్రాఫ్ట్ జాబితాతో వెలుగులోకి...

కొన్నేళ్లు తమ సాగులో ఉన్న భూములను వేరొకరి పేరిట ఎస్‌ఎఫ్‌ఎ జాబితాలో పేర్లు చేర్చడంపై రైతులు ఖంగుతిన్నారు. గతనెల 21న నారాయణరాజుపేట గ్రామ సచివాలయం వద్ద ప్రకటించిన జాబితాలో సాగుదారుల పేర్లు తారుమారుపై అవాక్కయిన రైతులు, తర్వాత మార్చి 25 నుంచి ఏప్రిల్ 13 వరకు ఇదే జాబితాపై అభ్యంతరాలు స్వీకరణకు నిర్వహించిన గ్రామసభలు కొందరు అర్జీలు కూడా పెట్టుకున్నారు. అయితే నారాయణ రాజుపేట రెవెన్యూ పరిధిలోని 200ఎకరాల ఇనాం భూముల్లో 90 శాతం వరకూ లింక్ డాక్యుమెంట్లు లేనందువల్లే పట్టాదారు పాసు పుస్తకాల మంజూరులో జాప్యం జరిగిందని రెవెన్యూ వర్గాలు అంటున్నాయి.



బాధిత రైతులకు సంఘీభావం ప్రకటిస్తున్న సిపిఎం నేత గంగారావు, తదితరులు

ఆర్‌డిఒ, తహశీల్దార్‌కు ఫిర్యాదు..

పూర్వీకుల నుంచి తమ పేర్లతో సాగులో ఉన్న భూములను వేరేవారి పేర్లతో ఎస్‌ఎఫ్‌ఎలో చేర్చడంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ, ఆర్‌డిఒ ఎస్ భాస్కర ఒడ్డి, తహసీల్దార్ కె వేణుగోపాల్‌కు ఇటీవల కొందరు రైతులు ఫిర్యాదు చేశారు. ఇవే భూములను సాగుచేస్తూ జీవనోపాధి పొందుతున్నామని, భూహక్కు పత్రాల కోసం ఎదురుచూస్తుంటే, ఏకంగా సాగుహక్కు కూడా లేకుండా చేసిన రెవెన్యూ లీలలపై ఆందోళన చెందుతున్నారు

రైతులకు అండగా సిపిఎం

ఏళ్లతడి సాగులో ఉన్న భూములను వేరొకరి పేరుతో ఎస్‌ఎఫ్‌ఎలో నమోదులో ఆందోళనలో ఉన్న బాధిత రైతులకు సిపిఎం బాసటగా నిలిచింది.బుధ వారం సిపిఎం నేత డాక్టర్ బి గంగారావు, భీమిలి జోన్ కార్యదర్శి రవ్వ నరసింగరావు గ్రామాన్ని సందర్శించారు. బాధిత రైతులతో మాట్లాడారు. రైతులకు న్యాయం జరిగే సిపిఎం అండగా ఉండి పోరాడుతుందని భరోసా ఇచ్చారు. బాధిత రైతులు ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు మొదలుకుని, రైతులకు న్యాయం జరిగే వరకు ప్రతివిషయంలోనూ తోడుగా ఉంటామని సిపిఎం నేతలు హామీనిచ్చారు.

రికార్డులు తారుమారుపై చర్యలు తీసుకోవాలి



పూర్వీకుల నుంచి రైతుల సాగులో ఉన్న దాదాపు ఐదు వేల కోట్ల విలువైన 400 ఎకరాల భూములకు రికార్డుల్లో పేర్లు తారుమారుచేసిన రెవెన్యూ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. నారాయణరాజు పేట, సింగనబంద, లక్ష్మీపురం, దాకమర్రి గ్రామాల్లో బడాబాబులు, రియల్టర్లు రైతుల భూములను కాజేసేందుకు కుట్ర చేస్తున్నారు. రైతులకు సిపిఎం బాసటా ఉంటుంది. స్థానిక ఎమ్మెల్యే రైతుల పక్షాన నిలబడాలి, కలెక్టర్, జెసి స్పందించి, బాధిత రైతులకు న్యాయం చేయాలి.

డాక్టర్ బి.గంగారావు. సిపిఎం నేత, విశాఖపట్నం

రైతుల అభ్యంతరాలు స్వీకరిస్తున్నాం...



నారాయణ రాజుపేట, లక్ష్మీపురం, సింగనబంద, దాకమర్రి గ్రామాల రైతుల నుంచి ఇప్పటి వరకూ 127 అభ్యంతరాలు స్వీకరించాం. రికార్డులు తారుమారు చేసినట్లుగా చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదు. 1960 నుంచి సంబంధిత రైతుల లింక్ డాక్యుమెంట్లు, వారి వద్ద ఉన్న భూపత్రాలు పరిశీలిస్తాం. ఎస్‌ఎఫ్‌ఎ డ్రాఫ్ట్‌పై గతనెల 25న గ్రామసభ నిర్వహించాం. రైతుల విజ్ఞప్తి మేరకు అభ్యంతరాల స్వీకరణ గడువు మరో పదిరోజులు పెంచాం. ఈ ప్రక్రియ పరిశీలనలోనే ఉంది. ఫైనల్ కాలేదు.

కోరాడ వేణుగోపాల్, తహసీల్దార్, భీమునిపట్నం మండలం

మతలబు చేశారు...



30 ఏళ్లుగా నేను, మా అన్నయ్య పైడి నాయుడు కలిసి 1,87ఎకరాలలో వరి సాగుచేసి జీవనోపాధి పొందుతున్నాం. ఇటీవల సచివాలయం వద్ద .రెవెన్యూ అధికారులు ప్రదర్శించిన ఎస్‌ఎఫ్‌ఎ జాబితాలో మా పేర్ల స్థానే వేరొకరి పేర్లు ఉన్నాయి. ఏదో మతలబు జరిగింది. న్యాయం జరిగే వరకు పోరాడతాం.

కాళ్ళ ఆదినారాయణ, రైతు, సింగనబంద

భూముల్ని కాజేసేందుకు కుట్ర



మా నలుగురు అన్నదమ్ముల పేరున 1,2,3 అడంగళ్లలో 13 ఎకరాల భూమి ఉంది. వరి, కూరగాయల పంటలు సాగుచేసి జీవిస్తున్నాం. ఎన్‌టిఆర్ సిఎంగా ఉన్నప్పుడే వేసిన రెండు వ్యవసాయ బోర్లను నేటకీ బిల్లులు చెల్లించి వినియోగిస్తున్నాం. మాపేరిట ఉన్న భూములను కాజేసేందుకు జరుగుతున్న కుట్రలను సాగనివ్వం.

కనకల వెంకటరమణ, రైతు, లక్ష్మీ పురం

అన్యాయం చేశారు...



దాదాపు 50 ఏళ్లుగా 2,20ఎకరాల భూములను సాగుచేస్తున్నాం. వరి, ఇతర పంటలు పండిస్తున్నాం. ఒక్కసారిగా తమ పేరిట భూములను వేరే వారి పేర్లతో రికార్డుల్లో నమోదు చేశారు. భూహక్కు పత్రాలు వస్తాయని ఆశగా ఎదురుచూస్తున్న మాకు ఇంతటి అన్యాయం చేయడం సబబు కాదు.

బోని అప్పలనాయుడు, రైతు, లక్ష్మీపురం

జిఒ31 రద్దు చేయాలని నిరసన

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రజలపై ఆర్థిక భారాలు వేసే జిఒ 31 వెంటనే రద్దు చేయాలని ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వామనమూర్తి డిమాండ్ చేశారు గురువారం అక్కయ్యపాలెం జంక్షన్‌లో రాష్ట్రవ్యాప్తంగా గూడ్స్ లారీలు, ప్రైవేటు బస్సులు, వ్యాన్లు కార్లుపై భారీగా పన్నులు పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 31 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వామనుమూర్తి మాట్లాడుతూ ప్రైవేట్ మోటార్ వాహనాలపై భారీగా పెంచిన పన్ను రద్దు చేసి రవాణా రంగాన్ని కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు లేక స్వయం ఉపాధి పథకం కింద ప్రైవేటు ఫైనాన్సర్ దగ్గర అధిక వడ్డీలకు అప్పులు తీసుకొని లారీలు కార్లు జీపులు వ్యానులు కొనుగోలు చేసి,. ప్రజలకు సేవలు అందిసూ, ప్రభుత్వానికి కోట్ల రూపాయలు పన్నులు చెల్లిస్తూ జీవనోపాధి పొందుతున్న వాహన యజమానులకు డ్రైవర్లకు క్లీనర్లకు బతుకును దుర్భరం చేయడం తగదని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన డీజిలు, పెట్రోలు, గ్యాస్ ధరలు, జిఎస్‌టి పన్నులతో రవాణా రంగం కుదేలవుతున్న తరుణంలో ఆదుకోవలసిన ప్రభుత్వాలే ఇలా పన్నులు పెంచుతూ ఆర్థిక భారాలు వేయడం సమంజసం కాదన్నారు.జిఒ 21 రద్దుచేయకుంటే, ప్రజాగ్రహానికి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ప్రైవేటు మోటారు వాహనాలపై పెంచిన పన్నుల భారం పరోక్షంగా ప్రజలపై పడుతుందని ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వం ఏకపక్షంగా పన్నులు పెంచుతూ విడుదల చేసిన జిఒలు 21,31 రద్దు చేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో సిపిఐ నాయకులు రావి కృష్ణ కె.శివ, కె.రాము, జి శ్రీను అప్పలరాజు పాల్గొన్నారు

తెలుగుదేశంతోనే బీసీల అభివృద్ధి

టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-వేపగుంట, విశాఖ

తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన వర్గాల అభివృద్ధి ప్రారంభమైందని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. విశాఖ జిల్లా పెందుర్తి మండలం వేపగుంట సమీపంలోని మీనాక్షి కన్వెన్షన్ హాల్లో, గురువారం ఉదయం బీసీలు, మత్స్యకారులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, ఒకప్పుడు వెనుకబడిన వర్గాలను పట్టించుకోని పరిస్థితి ఉండేదని, కేవలం కుల వృత్తుల మీద జీవనోపాధి చేసేవారని తెలిపారు. సముద్రంలోకి పోతే తిరిగి వస్తారో లేదో తెలియని పరిస్థితి మత్స్యకారులదని, తెలుగుదేశం పార్టీ హయాంలో వారి ప్రాణాలను కాపాడే టెక్నాలజిని తీసుకొచ్చామని తెలిపారు. మత్స్యకారుల పిల్లల కోసం తెలుగుదేశం పార్టీ హయాంలో 9 రెసిడెన్సియల్ స్కూల్స్ ఏర్పాటుచేశామని చెప్పారు. హుదూద్ తుపాను సమయంలో మత్స్యకారులకు ఎక్కువ బెనిఫిట్స్ కల్పించామన్నారు. పడవలు, బోట్లు డీజిల్‌కి ఎక్కువ రాయితీ ఇచ్చింది తెలుగుదేశం పార్టీయేనని స్పష్టం చేశారు. బోట్లు ధ్వంసం అయితే రూ.6 లక్షల పరిహారం ఇచ్చామని గుర్తు చేశారు. చేపలను పెంచుకునేవారికి ఆర్థికసాయం చేసి ఆదుకున్నామన్నారు.

ఆనాడు ఒక మంచి ఉద్దేశంతో ఫార్మాసిటీ ఏర్పాటుచేస్తే, నేడు అందులో పనిచేస్తున్న వారికి అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాక ముందు తలనిమిరాడు, ముద్దులు పెట్టాడు.. ఇప్పుడు పిడిగుద్దులు గుద్దుతున్నాడని జగన్‌ను ఉద్దేశించి చంద్రబాబు ఎద్దేవా చేశారు. టిడ్కో బాధితుల సమస్యలు విని టిడిపి అధికారంలోకి రాగానే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు బండారు సత్యనారాయణమూర్తి, కొల్లు రవీంద్ర, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, శ్రీభరత్ పాల్గొన్నారు.

నేటి రోడ్డు షో విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పట్టణంలో ఈ నెల 19న శుక్రవారం ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమానికి టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వస్తున్న సందర్భంగా చేపట్టిన రోడ్డు షోను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబు శుక్రవారం సాయంత్రం అనకాపల్లి పట్టణం సుంకర మెట్టు జంక్షన్ నుండి నెహ్రూ చౌక్ జంక్షన్‌కు వరకు రోడ్ షో నిర్వహించి, అనంతరం అక్కడ భారీ బహిరంగ సభలో ప్రసంగిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు డాక్టర్ కెకెవిఎ.నారాయణరావు, కోట్ని రామకృష్ణ, కుప్పిలి జగన్, బోడి వెంకటరావు, మల్ల గణేష్ పాల్గొన్నారు.



క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్

క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయని ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు అన్నారు. ఎలమంచిలి మున్సిపాలిటీ 20వ వార్డు పెద్దపల్లిలో వేమాంబిక యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల పట్ల యువత ఆసక్తిని పెంచుకోవాలన్నారు. ఈ టోర్నమెంట్లో ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.25వేలు, తృతీయ బహుమతి రూ.12,500 అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ, ఎంపీపీ బొద్దేపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, వైసిపి సీనియర్ నాయకులు బోద్ధపు ఎర్రయ్య దొర, కౌన్సిలర్లు దాసరి కుమార్ చిన్నమ్మలు, దుంగ అచ్యుతరావు, వైసీపీ నాయకులు దాసరి గణేష్ పాల్గొన్నారు.

ట్రెజరీ అధికారికి యుటిఎఫ్ అభినందనలు

ప్రజాశక్తి-చోడవరం

ఇటీవల సిపిఎస్ ఉపాధ్యాయులు తమ సిపిఎస్ నిల్వలో ఉన్న సొమ్మును 25 శాతం పాక్షికంగా ఉపసంహరించుకునే బిల్లులను సకాలంలో చెల్లింపులు జరగడానికి సహకరించిన చోడవరం సబ్ ట్రెజరీ అధికారి మూర్తి, అకౌంటెంట్ పైడిరాజుకు యుటిఎఫ్ అభినందనలు తెలిపింది. ఈ మేరకు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్, మండల అధ్యక్షులు కె.కామరాజు గురువారం వారికి కలిసి యుటిఎఫ్ డైరీ, జిఓల పుస్తకాలను ఇచ్చి సత్కరించారు.

ఉపాధి హామీ కూలీలకు ఒఆర్ఎస్ పంపిణీ

ప్రజాశక్తి- కె.కోటపాడు

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు గురువారం ఒఆర్ఎస్ ద్రావణాన్ని పంపిణీ చేశారు. మండలంలోని కె.కోటపాడు, కింతాడ, చౌడువాడ, గొండుపాలెం, రొంగలినాయుడుపాలెం, ఎ.కోడూరు, వారాడ తదితర గ్రామాలలో ఉపాధి హామీ పనులను ఏపీవో వసంత కుమార్ పరిశీలించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో శచిదేవి సిబ్బందిని ఆదేశించారు. ఏఎన్ఎం నాగమణి, వీఆర్పి బండారు గంగు నాయుడు, ఆశా కార్యకర్త రామలక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజా సంఘాల ప్రతినిధులు గురువారం డిఎస్‌పి సుబ్బరాజుకు వినతిపత్రం అందజేశారు. ప్రధాన రహదారిలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లకు సెల్లార్లు లేకపోవడం వల్ల వాహనాలు రోడ్డు మీద పార్కింగ్ చేస్తున్నారని, ఈ సమయంలో పోలీసులు ఫొటోలు తీసి ఫైన్లు వేయటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్టీఆర్ ఆసుపత్రి కూడలిలో ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేయాలని, పాత ప్రభుత్వ భవనాల్లో అసాంఘిక చర్యలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాసంఘాల నాయకులు డాక్టర్ చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, బొబ్బిలి గోవిందరాజులు, ముగడా అప్పారావు యాదవ్ పాల్గొన్నారు.

ఎస్‌పి ఆఫీసుకు 10 డెస్క్‌టాప్ కంప్యూటర్ల వితరణ

ప్రజాశక్తి- అనకాపల్లి

జిల్లా ఎస్‌పి కార్యాలయానికి గురువారం నక్కపల్లి హెట్రో కంపెనీ యాజమాన్యం 10 డెస్క్ టాప్ కంప్యూటర్లను అందజేసింది. కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల నుండి సుమారు రూ.6.50లక్షలతో కొనుగోలు చేసిన 10 కంప్యూటర్లను ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కెవి.మురళీకృష్ణకి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పి వి.సుబ్బరాజు, హెట్రో కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ కుల్లాయి రెడ్డి, జిఎం ఫైనాన్స్ సుబ్బారెడ్డి, సిఎస్ఆర్ హెడ్ సుధాకర్, హెచ్ఆర్ సీనియర్ జిఎం రాజా రెడ్డి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సెక్యూరిటీ ఎన్ఎస్ఎన్ మూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కంప్యూటర్లు అందజేసిన హెటిరో ప్రతినిధులు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్య పేట మండలం బంగారు మెట్ట గ్రామంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బంగారు మెట్ట ఎంపీపీ స్కూల్లో సర్పంచ్ మెరుగు కుమారి బాబురావు ఆధ్వర్యంలో డాక్టర్ ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది 110 మంది రోగులకు పరీక్షలు చేశారు. 30 మందికి ఆపరేషన్ చేయడానికి, 22 మందికి కళ్లద్దాలు పంపిణీకి ఎంపిక చేశారు. మిగిలిన వాళ్ళకి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఎల్లపు జగ్గారావు కోఆపరేటివ్ ప్రెసిడెంట్ సాయి రమేష్, యనమల వాసు, వార్డ్ మెంబర్ పర్రె రాజేష్, వైద్య సిబ్బంది కోఆర్డినేటర్ స్వాములు, సీతారాం, లీలావతి, ఫీల్డ్ అసిస్టెంట్స్ వి.భూపతి, ఎన్ సంతోషి, విటి అగ్గి వేసు, బంగారు మెట్ట, ఎల్‌బిపి అగ్రహారం, వడ్డాది, లోపూడి, ఎల్ సింగవరం గ్రామాలకు చెందిన రోగులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నిరంతర సాధనతోనే అభివృద్ధి

ప్రజాశక్తి-మునగపాక రూరల్ : నిరంతర సాధన వల్లే అభివృద్ధి కొనసాగుతూ ఉంటుందని, ఎప్పుడైతే నేర్చుకోవడం ఆగిపోతుందో అప్పుడు అభివృద్ధి ఆగిపోతుందని ధ్యాన గురువు సుజాత అన్నారు. నాగులపల్లి చంద్రశేఖర్ మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో యూత్ వర్క్ షాప్ గురువారం జరిగింది. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ ప్రయత్నమే లేకపోతే అభివృద్ధి శూన్యమన్నారు. గణిత ఉపాధ్యాయులు ఏవీఎన్ మూర్తి మాట్లాడుతూ ఆసక్తికరంగా నేర్చుకుంటే గణితమంత సరదా అంశం మరొకటి ఉండదన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు కే ప్రసాద్‌రావు గురజాడ అప్పారావు రచించిన దేశమంటే మట్టి కాదోయ్ గీతాన్ని ఆలపించే విధానం గురించి వివరించారు. విద్యార్థుల చేత మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో వీణా గురువు వాణి బాల, యోగా గురువు జగన్, కోయిలాడ శివాజీ, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

సేవావజ్రకు భవాని, లలిత కుమారి ఎంపిక

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం గ్రామ వాలంటీర్లు వర్రి భవాని, మురుమళ్ళ లలితా కుమారి సేవ వజ్ర అవార్డుకు ఎంపికయ్యారు. వీరికి అనకాపల్లిలో శుక్రవారం పసాంశపత్రం, నగదు పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ కొంకి అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సేవారత్నకు పేకాట దేవికుమారి, జి.భీమవరంకు చెందిన మారిశెట్టి వెంకట లక్ష్మి, నూతన గుండు పాలెం లక్ష్మి, సోమిరెడ్డి పార్వతి, వెదురు పర్తి మదిన మమత ఎంపికైనట్లు తెలిపారు. వీరిని ఎంపిపి కలగా లక్ష్మి, జెడ్‌పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు అభినందించారు.



వర్రి భవాని,



లలిత కుమారి

ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్స్ 40 శాతం ఇవ్వాలి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

ఉపాధి హామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్ 40 శాతం ఇవ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో మేట్లకు స్మార్ట్ ఫోన్లు పారితోషికం చెల్లించాలన్నారు. గురువారం దేవరాపల్లిలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండా కాలంలో ఏ పనులు దొరకక వ్యవసాయ కూలీలు మొదలు కొని డిగ్రీ చదువుకున్న యువతీ, యువకుల వరకు ఉపాధి పనులకు వెళుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ చట్టం పేదలకు వరంలాంటిదని, అటువంటి చట్టానికి మరింతగా నిధులు పెంచి అమలు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేయడానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. కార్పొరేట్లకు లక్షల కోట్లు సబ్సిడీలు ఇస్తున్న ప్రభుత్వం పేదలకు మాత్రం నిధులు తగ్గిస్తుందని విమర్శించారు. ఒకే సారి ఉపాధి హామీని రద్దు చేస్తే కూలీలు తిరగబడతారనే భయంతో ఈ పథకంలో అనేక షరతులు పెట్టి క్రమంగా నిర్వీర్యం చేయడానికి పూనుకుందని తెలిపారు. సమ్మర్ అలవెన్స్ రద్దు చేశారని, మంచినీళ్లు, టెంట్లు, మజ్జిగ వంటి సౌకర్యాలు నిలిపివేశారని, పని ముట్లకు డబ్బులు ఇవ్వడం లేదని, ఆన్‌లైన్ మస్టర్లు పెట్టి పేదలను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. మరోవైపు కూలీలకు కేటాయించిన నిధులను మెటీరియల్ ఛార్జీలు పేరు చెప్పి రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం దారి మళ్లిస్తుందని పేర్కొన్నారు. పై సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పేదల సొంతింటి కలను నెరవేర్చుతున్న ప్రభుత్వం



చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న దాడి ఎరుకునాయుడు

చంద్రబాబు దృష్టికి సర్పంచ్‌ల సమస్యలు

ప్రజాశక్తి-కె.కోటపాడు

గ్రామ సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు దాడి ఎరుకు నాయుడు తీసుకెళ్లారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం విశాఖ వచ్చిన చంద్రబాబును గురువారం దాడి ఎరుకునాయుడు వేపగుంటలో కలిసి సర్పంచుల సమస్యలను వివరించారు. కేంద్రం నుండి వచ్చే ఆర్థిక సంఘం నిధులను సర్పంచులకు తెలియకుండా రాష్ట్ర ప్రభుత్వం మళ్లించి గ్రామపంచాయతీలకు అన్యాయం చేసిందని పేర్కొన్నారు. దీంతో గ్రామాల్లో ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేని ఉత్సవ విగ్రహాలుగా సర్పంచ్‌లు పరిస్థితి మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచులు సొంత నిధులతో గ్రామాల్లో పనులు చేపడితే ఆ బిల్లులు ఇవ్వటానికి ఇబ్బందులు పెడుతున్నారన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని తెలిపారు.

మాజీ సర్పంచ్ ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : మండలంలోని చిన మల్లం గ్రామంలో 12 సెంట్లు సామాజిక అవసరాల నిమిత్తం కేటాయించిన భూమిలో మాజీ సర్పంచ్ గోలగాని రాజారావు, అతని సోదరుడు గోలగాని శ్రీనివాసులు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని గ్రామానికి చెందిన బి.శ్రీనివాసరావు, జి శ్రీరాములు, శివ, శ్రీను, తదితరులు, అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు గురువారం తెలిపారు. సదరు గ్రామ అవసరాల నిమిత్తం కేటాయించిన స్థలంలో రెండంతస్తుల భవనాన్ని చేపడుతున్నారని, సదరు భూమిపై పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు.

కుక్కకాటు వ్యాక్సిన్ కొరత

ప్రజాశక్తి -ములగాడ : శ్రీహరిపురం గొల్లలపాలెం ఆసుపత్రిలో కుక్కకాటు వ్యాక్సిన్ కొరత ఉంది.నాలుగు నెలలుగా ఆస్పత్రిలో వ్యాక్సిన్ లేక ఎంతోమంది ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు, ప్రస్తుతం కుక్కకాటు గురై పలువురు ఆసుపత్రికి వెళ్లినా వ్యాక్సిన్ లేదని చెప్పడంతో వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యుపిహెచ్‌సిలో కుక్క కాటు వ్యాక్సిన్ ఉన్నందున, గొల్లలపాలెం ఆసుపత్రిలో స్టాకు పెట్టడం లేదని ఆసుపత్రి సిబ్బంది అంటున్నారు. ప్రజలకు అందుబాటులో వ్యాక్సిన్‌ను ఉంచాల్సిన యంత్రాంగం అక్కడ ఉంది కదాయని ఇక్కడ పెట్టలేదంటూ నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం, ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వెంటనే గొల్లలపాలెం ఆసుపత్రిలోనూ అన్ని రకాల వ్యాక్సిన్లను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

కార్మికులకు ఆరోగ్య భద్రత కల్పించాలి..

ప్రజాశక్తి -ములగాడ : పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతల కారణంగా కార్మికులు ఎటువంటి అనారోగ్యానికి గురికాకుండా వారికి ఆరోగ్య భద్రత కల్పించాలని విశాఖపట్నం సర్కిల్ - 1 సహాయ కార్మిక కమిషనర్ ఎస్ మోహనలక్ష్మి పరిశ్రమల యాజమాన్యాలను ఆదేశించారు. పరిశ్రమలు, నిర్మాణరంగ సంస్థల యజమానులు ఉదయం, సాయంత్రం వేళల్లో పని గంటల మార్పు, పని ప్రాంగణంలో తగిన తాగునీటి సదుపాయం, వడదెబ్బకు గురికాకుండా ఓఆర్ఎస్, ఐస్ ప్యాక్స్, ఇతర అత్యవసర మందులు అందుబాటులో ఉంచడం, అత్యధిక ఉష్ణోగ్రతల వద్ద పనిచేసే కార్మికులకు తగిన రక్షణ కల్పించడం, కూల్ రూఫ్, విండోషాడ్ వంటి సహజపద్ధతులను పరిశ్రమలలో అనుసరించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న సర్కిల్ వన్ కమిషనర్ మోహన్ లక్ష్మి

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం

ప్రతి ఒక్క పేదవానికి సొంత ఇంటి స్థలం అందించడంతోపాటు సొంతంగా ఇల్లు నిర్మించుకునే అవకాశాన్ని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కల్పిస్తుందని ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం పంచాయతీ వద్ద గురువారం చోడవరం పంచాయతీలు ఎన్నో ఏళ్లగా పంచాయతీ స్థలాల్లో నివాసం ఉంటూ ఇల్లులు నిర్మించుకునే ఉన్నవారికి పంచాయతీ ద్వారా ఇంటి పన్ను రసీదులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చోడవరం పట్టణంలో సుమారు 600 మంది పేదలు గుడిసెలు, రేకులు షెడ్లు వేసుకొని పంచాయతీ స్థలాల్లో నివాసం ఉంటున్నారని తెలిపారు. చోడవరంలో అధికారం వెలగబెట్టిన నాయకులందరూ వీరిని మోసగించారని, వారికి ప్రయోజనం కలిగించలేదని ఆరోపించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం పేదలను గుర్తించి వారికి నివాసముంటున్న స్థలానికి శాశ్వత హక్కు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏడువాక సత్యారావు, చోడవరం పంచాయతీ ఈవో నారాయణరావు, బండి నూకాలమ్మ, వైస్ ఎంపీపీలు బైన కుమారి ఈశ్వరరావు, బుద్ద గంగరాజు, వైసిపి నాయకులు డాక్టర్ బండారు సత్యనారాయణ, న్యాయవాది కాంగ్రెస్ డేవిడ్, బండి శ్రీను, ఒరుగంటి నెహ్రూ, బొడ్డు శ్రీరామ్ మూర్తి, దేవరపల్లి సత్య, బొడ్డేటి సూర్యనారాయణ, పుల్లేటి వెంకటేష్, పందిరి శ్రీను, ఎంపీటీసీ అరుణ, జ్యోతుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

సిఐటియు ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ

ప్రతి జంక్షన్‌లోనూ చలివేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ప్రజల దాహార్తిని తీర్చడానికి ప్రభుత్వమే ప్రతి జంక్షన్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము డిమాండ్ చేశారు. మేడే ఉత్సవాల్లో భాగంగా స్థానిక యువశక్తి ఆటో స్టాండ్ కార్మికులు (సిఐటియు) ఆధ్వర్యంలో అచ్యుతాపురం జంక్షన్లో 3వ రోజు మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ తీవ్ర ఎండలతో ప్రయాణం చేసి అలసట చెందిన ప్రజలకు సకాలంలో తాగునీరు అందించాలనే ఉద్దేశంతో సిఐటియు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మజ్జిగ పంపిణీకి సహకారం అందించిన చంద్రబాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కే సోమనాయుడు, మహిళా సంఘం నాయకులు ఆర్ లక్ష్మి, యువశక్తి ఆటో యూనియన్ నాయకులు చండి, గౌరీ, రాజు, గుంటూరు శీను, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న సిఐటియు నాయకులు

వాడ్రాపల్లిలో 104 వైద్య శిబిరం

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 104 వైద్య సేవలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాంగ్రెస్‌ల నూక రాజు కోరారు. మండలంలోని వాడ్రాపల్లి గ్రామ సచివాలయంలో గురువారం ఆయన 104 వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ, షుగర వంటి దీర్ఘకాలిక వ్యాధులతో పాటుగా అనేక శారీరక సమస్యలకు మందులు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవల్లిక, సిహెచ్ఓ దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకులు ఉమామహేష్, సీతామహాలక్ష్మి, హెచ్‌వి, ఏఎన్ఎం ,ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఈ-అన్నదాత కార్డులుతో మేలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : నూతనంగా ఆవిర్భవించిన రూరల్ డెవలప్మెంట్ సొసైటీ రైతులు కోసం రాయితీలతో కూడిన పలు సేవలు అందుబాటులోకి తీసుకువచ్చిందని సొసైటీ మండల ఎగ్రికల్చరల్ రామ వెంకట సత్యనారాయణ మూర్తి, అసిస్టెంట్ ఎరుక నాయుడు, ఆదిరెడ్డి గోవింద తదితరులు తెలిపారు. ఈ మేరకు ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మిను, మండల వ్యవసాయ అధికారిణి వై.కాంతమ్మను గురువారం వారు కలిసి వాటిని అందజేశారు ఈ అన్నదాత కార్డు పేరిట ప్రతి రైతుకి బీమా సౌకర్యం, క్యాంటీన్ లలో సరుకులు 5శాతం నుండి 40 శాతం వరకు సబ్సిడీతో రైతుకు లబ్ధి కోరుతుందని తెలిపారు.

అనాథులు, మానసిక రోగులుంటే తెలియజేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : గ్రామాల్లోనూ, రోడ్ల వెంట, లేదా ఎక్కడైనా మానసిక రోగులు, అనాథులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సాయానికి రూ.10వేలు సేవా సంస్థ ఉపాధ్యక్షులు నూకేష్ గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తాము వాళ్ళని శుభ్రం చేసి, వాళ్ళ స్థితిగతులు పరిశీలించి, అవసరమైన వారిని విశాఖ మానసిక ఆరోగ్య కేంద్రానికి పంపిస్తామని పేర్కొన్నారు. అనాథలు ఉంటే వాళ్ళను దత్తత తీసుకొని అనాథ ఆశ్రమంలో చేర్పిస్తామని తెలిపారు. అనాథులు, మానసిక రోగుల ఫోటో తీసి వాళ్ళు ఉన్న ప్రదేశం వివరాలతో 81427 44037 నెంబర్‌కు పంపించాలని కోరారు.

పర్యావరణ జీవనశైలిపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఫారెస్ట్ రీసెర్చ్ రేంజ్ ఆఫీసర్ కె.ఉమామహేశ్వరి పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, చెట్లు, అడవులు, పచ్చదనాన్ని కాపాడుకోవడం విద్యార్థి దశనుంచి అలవాటు చేసుకోవాలని సూచించారు. పర్యావరణానికి అనుగుణంగా మానవ జీవన శైలి ఉండాలన్నారు. చెట్లను నరికివేయడం వలన వాతావరణంలో అనేక చెడు ప్రభావాలు తలెత్తుతాయన్నారు. ప్రతిమనిషి తప్పనిసరిగా చెట్లను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటిక నిర్మాణానికి నిధులు మంజూరు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కొండపాలెం గ్రామంలోని ముస్లిం మైనార్టీల శ్మశాన వాటిక నిర్మాణ నిమిత్తం అనకాపల్లి ఎంపీ బీసెట్టి వెంకట సత్యవతి రూ.3లక్షలు నిధులు మంజూరు చేశారు. కొండపాలెం గ్రామానికి చెందిన పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు గుమ్మడి రాజునాయుడు, షేక్ బాబ్జి తదితరులు గురువారం ముస్లిం శ్మశాన వాటిక అవసరంపై ఎంపీ సత్యవతిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమం వైసిపి నాయకులు కొల్లిమల్ల అచ్చం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సూరా శ్రీనివాస్‌కు సత్కారం

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట గ్రామానికి చెందిన కాంగ్రెస్ న్యాయ విభాగ జిల్లా అధ్యక్షులు సూరా శ్రీనివాస్ అనకాపల్లి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా గురువారం ఆయన నివాసంలో కాంగ్రెస్ నాయకులు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోయిన భాను మూర్తి యాదవ్ మాట్లాడుతూ రాబోయే రోజులలో మరింత ఉన్నత స్థానానికి శ్రీనివాస్ చేరాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కత్తెర శ్రీధర్, కెవి మాణిక్యం పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశానికి కొండకర్ల గ్రామానికి చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. 5వ తరగతి ప్రవేశానికి పరీక్ష రాసిన కొండకర్ల గ్రామానికి చెందిన నట్టే యశ్వంత్, పందిరి స్వరూప్, నట్టే వరుణ్ అనకాపల్లి గురుకుల పాఠశాలకు, కంట సాయి దుర్గ, వాసంతి ఎల్.కోట స్కూల్‌కి ఎంపికయ్యారు. జ్యోతిరావు పూలే అవార్డు గ్రహీత మారిశెట్టి వెంకట అప్పారావు వారికి మెటీరియల్ అందజేసి, పలు సూచనలు చేశారు. ఆయనకు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా అమ్మవారి పండగలు

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మేజర్ పంచాయతీ శివారు గొర్లివానిపాలెం గ్రామంలో బంగారమ్మ తల్లి, కుంచాలమ్మతల్లి అమ్మవార్ల పండుగ అనుపు మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి ధూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. సబ్బవరం సిఐ పి.రంగనాథం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వనిత ఉషోదయ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ప్రసాదాల పంపిణీ కార్యక్రమాన్ని సిఐ రంగనాథం ప్రారంభించారు. సాయంత్రం ఐదు గంటల నుండి అమ్మవారి ఘటాలతో స్వామి గరిడీలతో , చిటికెలు భజనలతో, నవదుర్గ అమ్మవారి వేషాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ అనుపు మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ డి. ప్రసాదరావు, శ్రీ సూర్య మెడికల్ షాప్ అధినేత బాదిరెడ్డి లక్ష్మణ, గండి దేముడు బాబు, గొర్లి రమణ, గండి హనుమంత్, వనిత ఉషోదయ యువజన సేవా సంఘం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు ,గ్రామ పెద్దలు ,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్ : ఎలమంచిలి మున్సిపాలిటీ 22వ వార్డు అగ్రహారం గ్రామంలో ఘనంగా పెద్దపుతల్లి పండుగ మహోత్సవం గురువారం గ్రామస్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు గొర్లి నానాజీ, కస్టర్ ఇన్చార్జి బొద్దపు శ్రీనివాసరావు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గ్రామం వెంకుపాలెం రోడ్డులో ఉన్న దుర్గమాంబ అమ్మవారి పండుగను బుధవారం నిర్వహించారు. అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి విష్ణుమూర్తి దంపతులు ఇందులో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీటీసీ పర్నీర్ వెంకటలక్ష్మి చంటి, పడాల గణపతి, ఆర్జీస్ సత్యనారాయణ, శంకర్రావు, కాంగ్రెస్‌ల చందు, పివిఎస్.అప్పారావు పాల్గొన్నారు.

మత్స్యకారుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి: హెటిరో డ్రగ్స్ కంపెనీ కొత్తగా వేస్తున్న పైపు లైన్ కు వ్యతిరేకంగా మత్స్యకారులు చేస్తున్న మహా శాంతియుత ధర్నా గురువారం నాటికి 531 రోజులకు చేరింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మత్స్యకారుల ఆందోళనకు మద్దతు తెలిపారు. శిబిరం వద్ద మత్స్యకారులతో కలిసి పైప్ లైన్ కు వ్యతిరేకంగా ఆకులు కట్టుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కంపెనీ వ్యర్థ జలాలను సముద్రంలోకి వదలడంతో ఉపాధి కోల్పోయి తమంతా రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పైప్ లైన్ వేసి మత్స్యకారుల పొట్ట కొట్టొద్దన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.నానాజీ, నాయకులు గోసల సోమేశ్వరరావు, చేపలు సోమేష్, మైలపల్లి దా్రాజు, మైలపల్లి నరేష్, మైలపల్లి బాపూజీ, పిక్కి రాజు, వాసుపిల్లి నూకతాత, చోడిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మత్స్యకారులు



పరిశీలిస్తున్న అధికారులు

జగనన్న లే-అవుట్ స్థలం పరిశీలన

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో ఎండపల్లి గ్రామానికి సంబంధించి జగనన్న లేఅవుట్ నిమిత్తం కేటాయించిన భూమిని గురువారం తహసిల్దార్ జానకమ్మ, భూగర్భ గనుల శాఖ అధికారులు, స్థానిక సర్పంచ్ పావని పరిశీలించారు. జగనన్న ఇళ్ళ నిర్మాణాలకు కేటాయించిన 30 సెంట్లు స్థలంలో కొంతమేర కొండ ప్రాంతం ఉండటంతో ఆ ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. 20 సెంట్లు మేర కొండ ప్రాంతం ఉండటంతో ఆ ప్రాంతాన్ని లెవెల్ చేయాల్సి ఉంది. ఈ సందర్భంగా మైనింగ్ అధికారులు మాట్లాడుతూ, తవ్విన మట్టిని (గ్రావెల్) ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అనుమతి ఇచ్చేది లేదని, ఆ ప్రాంతంలోనే తవ్వి లెవెల్ చేసుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఉర్ధవరావు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పశువైద్యశాల

పరాయి పంచన పశువైద్యశాల
అవస్థలు పడుతున్న సిబ్బంది

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో తంగేడు గ్రామానికి సంబంధించి పశువైద్యశాల లేక పోవడంతో పరాయి పంచన పశువైద్యం కొనసాగుతుంది. దశాబ్ద కాలంగా విశాఖ పాల సేకరణ కేంద్రం పక్కన చిన్న గదిలో పశు వైద్యశాల కొనసాగుతోంది. దీంతో ఆయా ప్రాంత రైతులు, సిబ్బంది కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఉన్న పశు వైద్యశాల శిథిలావస్థకు చేరుకోవడంతో గడిచిన 10 సంవత్సరాలుగా ఇక్కడే వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ వైద్యశాలకు వచ్చే మందులు, విత్తనాలు వేసుకునేందుకు, భద్ర పరిచేందుకు సిబ్బంది తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుంది. అంతే కాకుండా సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన పశువైద్యశాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా మరిడమ్మ పండుగ

-ఉత్సాహంగా ఎడ్లబండ్ల పోటీలు

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలో గురువారం కొంగసింగి గ్రామంలో మరిడమ్మ తల్లి పండుగను పంచాయతీ సర్పంచ్ ఎలమంచిలి నూకరత్నం, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులంతా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఎం.అచ్చిరాజు, సంఘ సభ్యుల ఆర్థిక సహకారంతో 2000 మందికి పులిహోర, మజ్జిగ, తాగునీరు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్లబండ్ల పోటీలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుండి వందల సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఎడ్లబండ్ల పోటీల్లో 12 మంది పోటీ పడగా లక్కవానిపాలెంకు చెందిన పైడితల్లి అమ్మతల్లికి చెందిన ఎడ్లు మొదటి స్థానం, అర్జునగిరి గ్రామానికి చెందిన పరవాడ నాయుడుకు రెండవ స్థానం, ఎం కొత్తపల్లి గ్రామానికి చెందిన నంబారు రామకష్ణ కు మూడవ స్థానం సాధించారు.మేళ తాళాలతో అమ్మవారిని ఊరేగించారు. భారీ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



పరుగు పెడుతున్న ఎడ్లు

సచివాలయంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి ఎస్. రాయవరం: స్థానిక సచివాలయం వద్ద ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్‌లో భాగంగా గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు, బాలింతలు, పిల్లలను తనిఖీ చేసి అవసరమైన వారికి రక్త పరీక్షలు నిర్వహించామని మెడికల్ ఆఫీసర్ ఎస్ ఎస్వి శక్తి ప్రియ తెలిపారు.'వరల్డ్ ఎయిడ్స్ వ్యాక్సిన్ డేపురస్కరించుకొని హెచ్ఐవి వైరస్, కలుషిత సూదులు, సిరంజీలపై అవగాహన కల్పించామన్నారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వై.అనుష, జి కొండబాబు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్ క్లస్టర్ పర్యవేక్షకులు, మలేరియా ఇంఛార్జి నోడల్ ఆఫీసర్ పి ఎస్ వి ఎస్ ప్రసాద్, స్థానిక సచివాలయం హెల్త్ సెక్రటరీ పి శ్రీరాములు, పి నూకరత్నం పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గృహాల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి -కోటవురట్ల: ప్రభుత్వం పేదలకు నిర్మిస్తున్న జగనన్న గృహాలు వేగవంతానికి రెవెన్యూ సిబ్బ కృషి చేయాలని తహసిల్దార్ జానకమ్మ తెలిపారు. గురువారం రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పటికే గ్రామాల్లో కేటాయించిన లేఅవుట్లలో నిర్మాణాలు సహా సొంత స్థలాల్లో నిర్మించుకునే వారికి ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లు అర్హత కలిగిన వారందరికీ అందజేయాలని సూచించారు. గ్రామాలలో అనధీనం భూముల వివరాలు సమగ్రంగా సేకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఉర్ధవరావు, కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ జానకమ్మ

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -గొలుగొండ: మండల కేంద్రంలో సర్పంచ్ కసిపల్లి అప్పారావు మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు, గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగంగా ఉంటుందని చలివేంద్రాన్ని ప్రారంభిం చామన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ , ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

టిడిపి నాయిబ్రాహ్మణ కన్వీనర్‌గా రమేష్

ప్రజాశక్తి -గొలుగొండ: తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా నాయిబ్రాహ్మణ సాధకారిక కమిటీ జిల్లా కన్వినర్‌గా గొలుగొండ గ్రామానికి చెందిన కోల్లెటికుర్తి రమేష్‌ను నియమిస్తూ మంగళగిరి పార్టీ కార్యాలయంలో బుధవారం ప్రమాణ స్వీకారం చేసినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. భీసి విభాగ జాతీయ నాయుకులు కోల్లు రవీంద్ర అధ్వర్యంలో నియామక పత్రాలు అందించి ప్రమాణ స్వీకారం నిర్వహిచినట్లు రమేష్ తెలిపారు. ఈ సంధర్భంగా రమేష్ గొలుగొండలో విలేఖర్లతో మాట్లాడుతూ, ఇంతటి భాధ్యతాయుత పదవిని తనకు అప్పగించేందుకు పార్టీకి సిపార్సు చేసిన చింతకాయల అయ్యన్నపాత్రుడుకి, యువ నాయకులు చింతకాలయ విజయ్, మండల పార్టీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడులకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.



రవీంద్రతో రమేష్

అట్రాసిటీ కేసులో వైసిపి నేత అరెస్టు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: పురపాలక సంఘం పరిధిలో గల బలిఘట్టంలో ఇటీవల జరిగిన దాడి కేసులో వైసిపి నాయకుడు సుర్ల నాయుడును అరెస్టు చేసినట్లు డిఎస్పి ప్రవీణ్ కుమార్ తెలియజేశారు. ఆయన అందించిన వివరాలు...ఈనెల 3న బలిఘట్టంలో జరిగిన మరిడి మహాలక్ష్మి అమ్మవారి పండగ సందర్భంగా జరిగిన ఘర్షణలో దళితులపై దాడి చేసినందుకుగాను ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కావడంతో సుర్ల నాయుడు, ఆయన అనుచరులపై కేసు పెట్టగా డీఎస్పీ ప్రవీణ్ కుమార్ విచారణ చేశారు. ఏ వన్ నిందితుడు సుర్ల నాయుడును అరెస్టు చేసినట్లు తెలిపారు. మిగిలిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు వీరే

డిగ్రీ 5వ సెమిస్టర్‌లో..

శ్రీ ప్రకాష్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి పాయకరావుపేట: స్థానిక శ్రీ ప్రకాశ విద్యా సంస్థలు విద్యార్థులు ఆంధ్రా విశ్వవిద్యాలయం ప్రకటించిన డిగ్రీ 5వ సెమిస్టరు పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. మాకినీడి నందిని, ఎంపీసీఎస్ గ్రూప్‌లో 10/10 గ్రేడ్ పాయింట్స్ సాధించిందని స్పేసేస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె. వీర్రాజు తెలిపారు. ఎంపీసీ ఎస్ లో కె.రేణుక 9.6/10, ఎంఈసిఎస్ లో కె. శిరీష 9.53/10, బయోటెక్‌లో టి.సౌజన్య 9.5/10, ఎంపీసీ లో కె.రేష్మ 9.5/10, సిబిజెడ్‌లో ఉష 9.2/10, బీకాంలో పి.వి.సాయి వాణి 9/10 గ్రేడ్ పాయింట్లు సాధించారని ఆయన తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్. వి.కె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, వైస్ ప్రిన్సిపల్ పెనుగొండ సుబ్బారావు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: మండలంలోని కొరుప్రోలు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పెను ప్రమాదం తప్పింది. గురువారం మధ్యాహ్నం కొరుప్రోలు నుండి నక్కపల్లి మండలం చందనాడ వున్న హెటిరో పరిశ్రమకు వెళు తున్న 33 కెవి విద్యుత్ లైను క్రాష్ ఆర్మ్ విరిగి షార్ట్ అయింది. స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటి ఎదుట వున్న స్తంభం వద్ద ఈ ప్రమాదం జరగడంతో చేకూరి సత్యన్నారాయణరాజు ఇంటి వద్ద మంచం పూర్తిగా దగ్ధమయింది. పక్కనే వున్న పలు ఇళ్ళలో సర్వీసు వైర్లతో పాటు గృహోపకరణాలు కాలి పోయినట్లు బాధితులు తెలిపారు.



33 కెవి విద్యుత్ లైను



ర్యాలీ చేస్తున్న అటవీ సిబ్బంది

పర్యావరణ పరిరక్షణ పై ర్యాలీ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని పలు గ్రామాల్లో అటవీశాఖ సిబ్బంది ఆధ్వర్యాన పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ సిబ్బంది మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు జీవన విధానాలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ మానవ మనుగడకు తీవ్ర నష్టాన్ని తీసుకొస్తుందని, దీని వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు. మండలంలోఇన గదంపాలెం, కినపర్తి, రేవడి ఆయా గ్రామాలలో కృష్ణదేవిపేట రేంజ్ అటవీ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ గార్డ్ ఎరుకులమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రమౌళి

ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటాం

కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : స్వదేశీయత పేరిట కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గంగిగోవు లాంటి ప్రభుత్వ రంగాన్ని అమ్మడం ద్వారా నిజమైన దేశద్రోహానికి పాల్పడుతోందని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వై.రాజు విమర్శించారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటామన్నారు. స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 777వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ కార్మికులు, నాయకులు కూర్చున్నారు. శిబిరం వద్ద ఏర్పాటుచేసిన కళాఖండాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వై.రాజు మాట్లాడుతూ ప్రయివేటు రంగంలో, దళితులు, మైనారిటీలకు రిజర్వేషన్లు ఉండవన్నారు. ప్రతి ఇంటిలో ఒకరో, ఇద్దరో ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని, అటువంటి వారికి ఉపాధి రావాలన్నా ఉద్యోగ అవకాశాలు కలగాలన్నా ప్రభుత్వ రంగంలోనే సాధ్యపడుతుందని చెప్పారు. అటువంటి ప్రభుత్వ రంగాన్ని నాశనం చేసేందుకు, కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చేందుకు మోడీ ప్రభుత్వం కృషిచేస్తోందని విమర్శించారు. ఈ చర్యలను దళిత సంఘాల ఐక్యతతో ఎదుర్కొంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, జోన్ కార్యదర్శి జి.ఈశ్వరరావు, ముఠా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్బారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి జి.అప్పలరాజు, డివైఎఫ్ఐ నాయకులు కె.గణేష్, కె.సంతోష్‌కుమార్, ఎం.ఈశ్వరరావు, ఎన్.ఎర్రిబాబు, డివిడి రాజు, మదీనా పాల్గొన్నారు.

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన

బిజెపి ఎంపీని అరెస్టు చేయాలి

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు



అనకాపల్లిలో ఆందోళన చేస్తున్న నాయకులు



కంచరపాలెంలో...

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

మహిళా రెజ్లింగ్ క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషన్ చరణ్ సింగ్‌ను, అథ్లెటిక్స్ క్రీడాకారులను వేధించిన హర్యానా మంత్రి సందీప్ సింగ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.

అనకాపల్లి : ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అనకాపల్లి ఎన్టీఆర్ గ్రౌండ్‌లో గురువారం ఉదయం మార్నింగ్ వాక్‌లో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ మహిళా రెజ్లర్లు తమపై జరిగిన లైంగిక వేధింపులకు నిరసనగా దేశ రాజధాని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద 25 రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్నా మోడీ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేకపోవడం దుర్మార్గమన్నారు. దేశ ప్రతిష్టను పెంచిన క్రీడాకారులకు న్యాయం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం తిరిగి క్రీడాకారులపైనే దాడులు చేయడం దారుణమన్నారు. పోక్సో, నిర్భయ చట్టాలని అమలు చేసి బ్రిజ్ భూషణ్‌ని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గంటా శ్రీరామ్, బి.ఉమామహేశ్వరావు, తరుణ్, చలపతి పాల్గొన్నారు.



పరవాడలో...

పరవాడ : పరవాడ మండల పరిషత్ జంక్షన్ వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు, ఆర్.శంకరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రమణ, ఎస్ రమణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం మాట్లాడుతూ రెజ్లర్ల ఆందోళనకు ప్రపంచం వ్యాప్తంగా మద్దతు లభిస్తుందని, దేశంలో ఉన్న ప్రజలందరిని ఏకం చేసి ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజా సంఘాల నాయకులు కె.మోహన్ మనోజ్ కుమార్, కేశవ, తనూ, మూర్తి, అభి, తరుణ్ పాల్గొన్నారు.



నర్సీపట్నంలో...

అచ్యుతాపురం : అచ్యుతాపురంలో సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, ఐద్వా నాయకులు ఆర్.లక్ష్మి, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.సోమినాయుడు మాట్లాడుతూ, రెజ్లర్లు లైంగిక వేధింపులకు గురైనట్లు చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేయకుండా తిరస్కరించటం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మూర్తి, దూళి వెంకయ్య నాయుడు, రాము, రెడ్డి శ్రీనివాసరావు, స్కేటింగ్ కోచ్ బోండా ధర్మేంద్ర, ఆర్ భువన, అరుణ్ పాల్గొన్నారు.

చోడవరం : సిఐటియు, ఐద్వా, ఆధ్వర్యాన స్థానిక కోటవీధిలో మహిళలు ప్లే కార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేసి ఎంపీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మల్ల యోధులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా నాయకులు జి వరలక్ష్మి, జె.వెంకటలక్ష్మీ, సత్యవతి, ఆర్.లక్ష్మి, దేముడమ్మ, రమణమ్మ, మంగమ్మ, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, బిజెపి పార్లమెంటు సభ్యుడైన బ్రిడ్జ్ భూషణ్ సింగ్ ను తక్షణం అరెస్టు చేయాలని సిపిఐ, సిపిఎం, ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియం, ఆర్టీసి కాంప్లెక్స్, కాఫీ క్యూరింగ్ సెంటర్‌లలో నిరసన చేస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి మాట్లాడుతూ, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న మహిళా రెజ్లర్లను పిలిచి మాట్లాడక పోవడం బాధాకరమన్నారు. 39 కేసుల్లో నిందితుడిగా ఉన్న బిజెపి ఎంపీ, రెజ్లర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు బ్రిడ్జిభూషణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేసి, అన్ని అధికార రాజకీయ పదవుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. రెజ్లర్లు మెడల్స్ సాధించినప్పుడు ఇంటికి పిలిచి మరీ ఆతిథ్యం ఇచ్చిన ప్రధానమంత్రి ప్రస్తుతం మౌనం వహించడాన్ని తప్పు పట్టారు. ఈనెల 20న ఉదయం 10 గంటలకు రెజ్లర్ల ఆందోళనకు మద్దతుగా జిల్లా కలెక్టర్‌కు వినతిని ఇస్తామన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా కార్యదర్శి సుబ్బలక్ష్మి, కన్వీనర్ కనక మహలక్ష్మీ, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు యల్.గౌరి, ట్రెజరర్ కెవీ సూర్యప్రభ, మీడ్డే మీల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె ప్రసన్న, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు జి. గీతాకృష్ణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డి. సత్తిబాబు, కార్యదర్శి అడిగర్ల రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కొండల రావు, రైతు సంఘం నాయుకులు మాకిరెడ్డి రామునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ పాల్గొన్నారు.

నక్కపల్లి: భారత రెజ్లర్లు సమాఖ్య అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న భారత్ రెజ్లర్లకు మండలంలో రాజయ్యపేట, బోయపాడు గ్రామాలకు చెందిన క్రీడాకారులు గురువారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాడుతూ, భారత రెజ్లర్లు సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ మహిళా రెజ్లర్లపై సెక్సువల్ వేదింపులకూ పాల్పడ్డారని ఆడియో, వీడియో టేపులు ఆధారాలతో సహా డిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసారన్నారు. ఆందోళన ప్రారంభించి 4 నెలలు అవుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ పై చర్యలు తీసుకోవాలని, ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా మహిళా క్రీడాకారులకు రక్షణ కల్పించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.నానాజీ, పిక్కి కొండలరావు, మైలపల్లి బాపూజీ, మైలపల్లి నరేష్, చోడిపల్లి తాతాజీ, మఠం రామచంద్రరావు, గరికిన ఏసురాజు పాల్గొన్నారు.

కంచరపాలెం : మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఐద్వా, సిఐటియు, ప్రజా సంఘాలు డిమాండ్ చేసారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద బాధిత రెజ్లర్లు 26 రోజులుగా చేస్తున్న పోరాటానిక సంఘీభావంతో గురువారం కంచరపాలెంలో నిరసన చేపట్టారు. బి ఎన్ ఆర్ భవనం నుంచి ఊర్వశి వరకు నిరసన ప్రదర్శన, అనంతరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు బి. పద్మ, సిఐటియు జోన్ కార్యదర్శి ఒ.అప్పారావు మాట్లాడుతూ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఘటనపై ఇంతరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం దారుణమన్నారు. క్రీడావ్యవస్థను, క్రీడాకారులను అగౌరవ పరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గమన్నారు. "బేటీ బచావో, బేటీ పడావో" అంటూ గొప్పలు చెబుతున్న కేంద్రం, బాధితుల్లో ఒక మైనర్ ఉన్నప్పటికీ చర్యలకు ఉపక్రమించకపోవడం సిగ్గుచేటన్నారు. ఇంతటి దారుణఘటనకు పాల్పడిన వారిని బిజెపి ప్రభుత్వం రక్షించడం దుర్మార్గమని, బాధితులకు ఐద్వా, సిఐటియు, ఇతరప్రజాసంఘాలు అండగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఐద్వా జోన్ కార్యదర్శి ఎ.పుష్పాంజలి సాహూ, వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు, ఐద్వా నేతలు ఒ.విజయ, కల్యాణి, శారద, కుమారి, సంజు, సిఐటియు నేతలు ఎ.మోహన్ రావు గంగరాజు పాల్గొన్నారు.



నక్కపల్లిలో..

ప్రజా ఉద్యమాలపై పోలీసు నిర్బంధం ఆపాలి

పోలీస్ కమిషనర్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రజా ఉద్యమాలపై పోలీసు నిర్బంధం ఆపాలని, ప్రజాతంత్ర ఉద్యమాలపై కొంత మంది పోలీసు అధికారులు అక్రమ కేసులు, బైండ్‌ఓవర్ కేసులు బనాయిస్తున్నారని, ఇది భావ్యం కాదని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఉపాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు తదితర ప్రతినిధి వర్గం గురువారం నగర పోలీసు కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. సిఐటియు ప్రజాతంత్రంగా కార్మికులు, ప్రజల హక్కుల కోసం పోరాడే నిజాయతీ, చిత్తశుద్ధి కల్గిన యూనియన్ అని, ఎటువంటి చట్ట వ్యతిరేకమైన, అవినీతికరమైన, ద్రోహపూరితమైన చర్యలకు పాల్పడదని వినతి పత్రంలో పేర్కొన్నారు. అటువంటి కార్మిక నాయకులపైనా, కార్యకర్తలపైనా కొంత మంది పోలీసు అధికారులు అక్రమ కేసులు బనాయించి, తహశీల్దార్ వద్దకు తీసుకువెళ్ళి రూ.లక్షకు బైండ్‌ఓవర్ కేసులు బనాయిస్తున్నారని, ఇది అన్యాయమని, రాజ్యాంగం, సహజ న్యాయసూత్రాలకు భిన్నమైనదని పేర్కొన్నారు. ఈ విషయంపై నగర పోలీస్ కమిషనర్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ఈనెల 3న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన గళం వినిపిస్తే, విశాఖలో 24 మంది కార్యకర్తలపై రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా కేసులు బనాయించారని తెలిపారు. స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు సమస్యలు చెప్పుకునేందుకు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు వెళ్తే నలుగురు నాయకులు, కార్యకర్తలపైన కేసులు పెట్టారన్నారు.

క్లాప్ డ్రైవర్లకు జిఒ 7 ప్రకారం రూ.18,500 జీతం అమలుచేయాలని కోరుతూ ఈ నెల 12న యూనియన్ నాయకులు లేబర్ ఆఫీస్‌కి వెళ్లారని, పోలీసులే దగ్గరుండి జెసిఎల్ దగ్గరకు తీసుకెళ్లారని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని తెలిపారు. అయినా నాలుగు రోజుల తరువాత అంటే 16వ తేదీన పోలీసులు సుమారు 30 మందిపై అన్యాయంగా కేసులు బనాయించారని తెలిపారు. మరుసటి రోజు జివిఎంసి వద్ద తాము ధర్నా చేస్తుంటే ఇద్దరికి నోటీసులు ఇచ్చారన్నారు. సుమారు 49 మందిపైన కేసులు బనాయించారని, బైండ్‌ఓవర్ కేసులు పెట్టారని వివరించారు. గతంలో ఎప్పుడూ ఇటువంటి కేసులు బనాయించలేదన్నారు.

ముఖ్యమంత్రి వైజాగ్ వచ్చినప్పుడు సిఐటియు ఎటువంటి పిలుపులు ఇవ్వనప్పటికీ ముందుస్తు అరెస్టులు, గృహ నిర్బంధం చేస్తున్నారని, నాయకుల ఇళ్లకు కానిస్టేబుళ్లు రాత్రులు వెళ్లి ఇళ్ళలో కూర్చుంటున్నారని ఫిర్యాదు చేశారు. ఈ విషయాలపై నగర పోలీస్ కమిషనర్ తగు విచారణ జరపాలని కోరారు. వాస్తవ పరిస్థితిని ఆలోచించి సిఐటియు నాయకులు, కార్యకర్తలపై మోపిన కేసులను ఉపసంహరించాలని విజ్ఞప్తి చేశారు.